క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి


ప్రసాదరాజును సత్కరిస్తున్న నాయకులు

కాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు మన్నె నాగరాజు స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజును వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు మన్నె నాగరాజుయాదవ్ గురువారం ఆయన ఇతర నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వారు నాగరాజు యాదవ్‌కు సూచించారు.కార్యక్రమంలో వీరమల్లు బోసు, మన్నె పోతురాజు, బొక్కా రాంబాబు, ధనుంజయ, శివనాగరాజు, చంద్రరావు, సింహాచలం, మన్నె శ్రీను, మందపాటి రవి, మన్నె సోమేష్, కళ్ళింపూడి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్ట్ నిపుణుల బృందం పర్యటన


టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్జెక్ట్ నిపుణులు

భీమవరం: భీమవరం పట్టణం, మండలంలోని గురువారం వివిధ పాఠశాలలను మండల స్థాయి సబ్జెక్ట్ నిపుణుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సబ్జెక్టు నిపుణులు సీహెచ్ వీర రాఘవ ప్రసాద్, కేసీహెచ్ సాయి రామ్, రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ టెన్త్ క్లాస్ సీ, డీ గ్రేడ్ విద్యార్థులు తక్కువ సమయంలో ఏ విధంగా చదవాలో వివరించారు. పాఠశాలల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులకు నూరు శాతం విద్యార్థులు హాజరై మంచి ఫలితాలను సాధించాలన్నారు. పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడానికి కావాల్సిన పఠణా నైపుణ్యాలు, వ్యాకరణాంశాలు, గణితంలో గ్రాఫ్ వంటి ముఖ్యమైన విషయాలు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో టి.అప్పన్న, టి.నమ్మాళ్వార్, సీహెచ్ శ్రీనివాస్, జె.శ్రీనివాసరావు, జి.సుకుమార్, బి.రాము తదితరులు పాల్గొన్నారు.

ఎర్నేస్ట్ పాల్‌కు తెలుగుతేజం పురస్కారం అందజేత


గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా తెలుగు తేజం పురస్కారం అందుకుంటున్న ఎర్నేస్ట్‌పాల్

భీమవరం అర్బన్: మండలంలోని చినఅమిరం గ్రామంలో ఇమ్మాన్యుయేల్ చిల్డ్రన్ హోమ్ నిర్వాహకుడు బత్తుల ఎర్నేస్ట్ పాల్‌ను ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలుగు తేజం పురస్కారంతో సత్కరించారు. ఎర్నేస్ట్ పాల్ అనాధ పిల్లల సంరక్షణకు చేస్తున్న సేవలకు గానూ రాజమహేంద్రవరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సింగర్ గజల్ శ్రీనివాస్ చేతులు మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. తెలుగు తేజం పురస్కారం అందుకున్న ఎర్నేస్ట్ పాల్‌ను వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్ బందన పూర్ణచంద్రరావు, పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.



రైతులకు భరోసా ఏదీ?

- అలంకారప్రాయంగా మారిన రైతు సేవా కేంద్రాలు
- పేరు మార్చి చేతులు దులుపుకున్న కూటమి ప్రభుత్వం


సీసలి రైతు భరోసా కేంద్రం

కాళ్ల: రైతుల చెంతకే సేవలందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు నేడు అలంకారప్రాయంగా మారాయి. ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని పలువురు రైతులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా అందించే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే వారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల గడుస్తున్నా ఆర్బీకేల ద్వారా రైతులకు సేవలను అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్యంగా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రైతు భరోసా కేంద్రం పేరును మాత్రం రైతుల సేవా కేంద్రంగా మార్చారు. అయితే పేరు మార్చినా ఆయా కేంద్రాల రైతులకు ఎలాంటి సేవలు అందడం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

హామీలు పక్కనపెట్టిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏటా రైతులకు రూ.20 వేల ఇస్తామని ప్రకటించింది. ఈ ఏడాదికి ఖరీఫ్ ముగిసి పోయింది. మరో కొద్ది నెలల్లో రబీ సీజన్ కూడా ముగిసిపోతుంది. అయినా ఆ పథకం అమలు ఊసే లేకుండా పోయింది. జగనన్న పాలనలో రైతు పంట నష్టపోతే వారికి పరిహారం అందించేందుకు ఉచిత పంటల బీమా వర్తింపజేసింది. అందుకుగాను ప్రీమియం భారాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే భరించింది. కానీ నేడు మాత్రం బీమా బాధ్యతలను కూటమి ప్రభుత్వం రైతులపై మోపి భారం దించుకుంది. ఒక్కొక్క పంటకు ఒక్కో రేటు చొప్పున బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి వస్తుంది.

నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల వివరాలు

మండలం	రైతు సేవా కేంద్రాల సంఖ్య
కాళ్ల	21
ఆకివీడు	12
ఉండి	21
పాలకోడేరు	18

సేవలు నిల్

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవలను ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదు. గతంలో రైతు సేవా కేంద్రాల ద్వారానే విత్తనాలు, పురుగు మందులు అందించే వారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రెండు సీజన్లలోనూ ఎలాంటి విత్తనాలు, పురుగుమందులను రైతులకు అందించలేదు. ముఖ్యంగా గత ఐదేళ్లు ఆర్బీకేల ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు యంత్రసాయం అందించింది. గ్రూపులుగా ఏర్పడిన రైతులకు యంత్ర పరికరాలను అందజేసి వ్యవసాయానికి వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టింది. యంత్రాలను కూడా ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. దీంతో ఆధునిక యంత్రాలతో సేద్యం చేసి మంచి దిగుబడులు సాధించారు. అలాగే రైతులకు సాంకేతిక సాయం అందుబాటులో ఉండేందుకు ఆర్బీకేల్లో కియోస్కలను ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ముందస్తుగా బుక్ చేసుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అంతే కాకుండా గత ప్రభుత్వం హయాంలో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా పగడ్బంధీగా చర్యలు తీసుకుని ఏ సీజన్‌లో ఆ సీజన్‌కు కావాల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులందరికీ సకాలంలో అందజేశారు. ప్రస్తుతం రైతులు ఎరువుల కోసం ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పెద్దలు స్పందించి రైతులకు ఎంతో ఉపయోగపడే రైతు సేవా కేంద్రం సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

మెకానిక్ సస్పెషన్‌ను వెనక్కి తీసుకోవాలి


భీమవరం ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఆర్టీసీ డిపో గ్యారేజిలో మెకానిక్‌గా పనిచేస్తున్న యూవీ రావును డిపో మేనేజర్ అక్రమంగా సస్పెండ్ చేశారని గత 15 రోజులగా ఎన్ఎంయూఏ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్మికులు డిపో మేనేజర్ మధ్య బుధవారం జరిగిన చర్చలు విఫలం కావడంతో తమకు న్యాయం చేయాలని మెకానిక్ తరపున యూనియన్ నాయకులు, కార్మికులు డిపో వద్ద గురువారం రిలే నిరహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా యునియన్ నాయకులు మాట్లాడుతూ అక్రమంగా 2019 సర్క్యూలర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేసిన యూవీ రావును వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వైవీ రావు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎ.నాగేశ్వర రావు, జోనల్ మెంబర్ లలితా, రాష్ట్ర యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

భీమవరం: ఎస్ఎఫ్ఐ 46వ జిల్లా మహాసభలను ఫిబ్రవరి 7న భీమవరంలో నిర్వహిస్తారని, ఈ సమావేశాలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ కోరారు. గురువారం పట్టణంలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యా రంగంలోని సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్ పోరాటానికి శ్రీకారం చుడుతూ ప్రణాళిక సిద్ధం చేయడానికి మహాసభల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు 7 నెలలు గడిచిపోయినా పాఠశాల విద్యార్థులకు తల్లివందనం ప్రస్తావనే లేదని మండిపడ్డారు. పేద మధ్య తరగతి విద్యార్థులు విద్య అభ్యసిస్తున్న సంక్షేమ హాస్టల్లో ఆరేడు నెలలుగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయలేదన్నారు. విద్యార్థి సమస్యలపై చర్చించే మహాసభల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు ఎస్.లక్ష్మణ్, కార్యదర్శి బి.గణేష్ ఉపాధ్యక్షులు చిన్నం శాంతి, డి.సింధు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన


మోగల్లు అంగన్‌వాడీ కేంద్రం వద్ద మొక్కలు నాటుతున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించాలని, ఆడపిల్లలను చదివించాలని, ఆడపిల్లల నిష్పత్తి పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.సూర్యకుమారి, జి.పార్వతి, విమల, చంద్రకుమారి, దేవిరాధ, సుబ్బలక్ష్మి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన నలుగురిపై కేసు నమోదు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి వచ్చి కమిషనర్ ఎక్కడ ఉన్నారు? అని అడిగి, తనపై నలుగురు వ్యక్తులు దురుసుగా ప్రవర్తించారని మేనేజర్ వెంకటేశ్వరరావు బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విధుల్లో ఉన్న వెంకటేశ్వరరావుపై ఎయిమ్స్ అనే సంస్థకు చెందిన దొడ్డి నాగరాజు, బండి మధు, బట్ట తిలక్‌లు విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు గురువారం విలేకరులకు చెప్పారు. నిందుతులను అరెస్టు చేశామని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఆకివీడు: స్థానిక 33 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 33 కేవీ ఫీడర్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆకివీడు, గుమ్ములూరు రోడ్డు ఎస్ఎస్‌లో అన్ని 11కేవీ ఫీడర్స్, అజ్జమూరు ఫీడర్స్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి


ధర్మ పరిరక్షణకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ధర్మ ప్రచారక్ కుమారస్వామి అన్నారు. మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో గోగులమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మ ప్రచారక్ కుమారస్వామి మాట్లాడుతూ సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. అనంతరం సనాతన ధర్మంపై కరపత్రాలను పంపిణీ చేశారు. జిల్లా ధర్మ ప్రచారక్ కన్వీనర్ నక్కా రమోజీ, తిరుమల తులసీరావు, కోళ్ల విజయ భాస్కరరావు, రాజేశ్వరి, శ్రావణి, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళకు కుట్టు మెషీన్ అందజేత

భీమవరం: మానవత సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆదర్శనగర్ రామాలయం వద్ద ఓ మహిళ జీవనోపాధికి కుట్టు మెషీన్, నాలుగు కుటుంబాలకు నిత్యావసరాలు అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్‌వర్మ, చైర్మన్ బుద్దరాజు వెంకటపతిరాజు మాట్లాడుతూ ఉణుదుర్రు గ్రామానికి చెందిన తీపర్తి నాగమణి ఉపాధి నిమిత్తం కుట్టు మెషీన్ అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో దాట్ల కృష్ణంరాజు, ఝాన్సీలక్ష్మి, కారుమూరి నర్సింహమూర్తి, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలిక వైద్యం కోసం సాయం

భీమవరం అర్బన్: ఆపదలో ఉన్న పేదలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో దాతలు ముందుకు రావాలని గుడ్ పీపుల్ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు గుంటి ప్రభు అన్నారు. భీమవరం మండలంలోని జొన్నలగరువులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గాయాలపాలైన తొమ్మిదేళ్ల చిన్నారి ఏలేటి స్వరూప వైద్యానికి గుడ్ పీపుల్ హెల్పింగ్ హ్యాండ్స్, అంబేడ్కర్ యూత్ ఫోర్స్ సేవా సంస్థల ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం బాలిక తల్లిదండ్రులు ఏలేటి యేసేపు, మణిలకు అందించారు. కార్యక్రమంలో నక్కా అశోక్‌బాబు, కుచ్చనపల్లి రాజేంద్ర, గోడి ప్రసన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి


నియోజకవర్గస్థాయి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులతో ఇన్‌చార్జ్ పీవీఎల్

కాళ్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని నియోజకవర్గ అనుబంధ విభాగాల కమిటీల ప్రతినిధులతో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం మండలంలోని పెద అమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో నూతనంగా అనుబంధ విభాగాల్లో పదవులకు ఎన్నికైన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి నట్టేట ముంచిందని ఎద్దేవా చేశారు. జగన్‌మోహనరెడ్డి పాలనలో ప్రజలంతా సంక్షేమ పథకాలు పొందుతూ ఎంతో ఆనందంగా ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం కూటమి పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాలనను, ఆయనిచ్చిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అనుబంధ విభాగాల్లో నూతనంగా ఎన్నికైన సభ్యులందరూ ప్రజల పక్షాన నిలవాలని అన్నారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో నూతనంగా ఎన్నికైన అనుబంధ విభాగాల సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కాళ్ల, ఉండి మండలాల కన్వీనర్‌లు పెన్మత్స అంజనేయరాజు, గణేశ్న రాంబాబు, ఎండీ జహంగీర్, ధనుజంయ, వేగేశ్న జయరామకృష్ణంరాజు, అంబటి రమేష్, పుప్పాల పండు, కఠారి లక్ష్మీపతిరాజు, డొక్కు వెంకటసుబ్రహ్మణ్యం, ఎరిచెర్ల గ్లాడ్‌సన్, వేగేశ్న బాల వెంకటనాగరాజు, గుండు నాగేశ్వరరావు, పెన్మత్స రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు ప్రత్యేకాలంకరణ


ఆదిలక్ష్మి అమ్మవారి అలంకరణలో మావుళ్లమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వారి 61 వార్షిక మహోత్సవాల్లో భాగంగా గురువారం మావుళ్లమ్మను ఆదిలక్ష్మి అమ్మ వారిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అలాగే వార్షిక మహోత్సవాల్లోభాగంగా గురువారం అమ్మవారి ఆలయం వద్ద సాయంత్రం 5 గంటలకు మొగలిచెర్ల నాగమణి భాగవతారిణి తెనాలి బృందం ప్రదర్శించిన హరికథ, రాత్రి 8 గంటలకు స్వాతి ఆర్కెస్ట్రా ప్రేక్షులకు అకట్టుకుంది. అలాగే శుక్రవారం మావుళ్లమ్మ వారిని ధాన్యలక్ష్మీగా అలంకరించనున్నారు.

కోర్టు ఆదేశాల మేరకే ఆక్రమణల తొలగింపు

ఆకివీడు: స్థానిక ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు కలుషితమవుతుందని అందువల్ల ఆక్రమణలు తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే అధికారులు ఆక్రమణలు తొలగిస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరువు చుట్టూ ఉన్న 32 మంది ఆక్రమణదారుల్లో 22 మందికి వైఎస్సార్ సీపీ హయాంలో పట్టాలు ఇవ్వడంతో వారు ఇళ్లు కూడా నిర్మించుకున్నారని స్పష్టం చేశారు. అయితే ఈ తొలగింపు విషయాల్లో తన పాత్ర ఉందని పలువురు ఆరోపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఆక్రమణదారులు తనపై దౌర్జన్యానికి దిగుతున్నారని అందువల్ల తనకు రక్షణ కల్పించాలని జాన్ వెస్లీ విజ్ఞప్తి చేశారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వీరవాసరం: స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మట్టా వెంకటేశ్వరరావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ బలరామరాజు గురువారం తెలిపారు. అతని వద్ద నుంచి 6 మద్యం (180 ఎంఎల్) బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

రాములోరి విగ్రహాలకు క్షీరాభిషేకం


రాములోరి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక తీగల దొడ్డి ప్రాంతంలోని 32 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, రాములోని విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గురువారం ధాన్యాదివాసం, క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో అంగప్రత్యంగ హోమం, కళా హోమం శాలార్చన నిర్వహించారు. అర్చకులు మొవ్వ సుబ్రహ్మణ్య రవి ఆధ్వర్యంలో హోమం చేశారు. శుక్రవారం సీతారాములోరి విగ్రహాల ప్రతిష్ఠ, 32 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణలు జరుగనున్నాయని వార్డు కౌన్సిలర్ గేదల అప్పారావు చెప్పారు. ఈ సందర్భంగా యంత్రస్థాపన, కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి చేయనున్నట్లు చెప్పారు.

బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా ప్రసాద్


డీవీడీ ప్రసాద్

వీరవాసరం: వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా వీరవాసరం మండలం తోలేరుకి చెందిన దొంగ వెంకట దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ప్రసాద్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

